ఈద్ ముబారక్


వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులోని ఈద్గాపై నమాజ్‌లో ముస్లింలు


గంభీరావుపేట: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


వేములవాడరూరల్: తుర్కాషినగర్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


వీర్నపల్లి: మసీదు వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


చందుర్తి ఈద్గాలో..

త్యాగానికి పత్రీక అయిన బక్రీద్ పండుగను జిల్లాలో ముస్లింలు గురువారం భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద నమాజ్ పూర్తి చేసి, దేశం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు బాగుండాలని ప్రార్థించారు. అనంతరం ఒకరికి ఒకరు ఆత్మీయ అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఏఎంసీ మాజీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు వెంకటేశ్, బన్సీలాల్, అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

– వేములవాడ/వేములవాడరూరల్/ఇల్లంతకుంట/వేములవాడఅర్బన్/బోయినపల్లి/చందుర్తి/తంగళ్లపల్లి/వీర్నపల్లి/ముస్తాబాద్/సిరిసిల్లఅర్బన్/గంభీరావుపేట

అఖండ భజన కార్యక్రమం ప్రారంభం


చందుర్తి మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

చందుర్తి: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్థానిక శ్రీమహాలక్ష్మి ఆలయంలో అఖండ భజన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. భజన మండలి ఆలపించిన భక్తిగీతాలతో ఆలయ ప్రాంగణం హోరెత్తిపోయింది. 19 ఏళ్లుగా భజన మండలి సభ్యులు వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ భజన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ, ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేశ్ హాజరయ్యారు. జెడ్పీటీసీ నాగం కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఏనుగుల శ్రీనివాస్, చందుర్తి మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మాజీ సర్పంచ్ గొట్టే ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.


అఖండ భజనలో పాల్గొన్న నాయకులు

ఇల్లంతకుంట: తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని జంగంరెడ్డిపల్లి శ్రీరామలింగేశ్వరాలయంతో పాటు వల్లంపట్ల, గాలిపల్లి శివాలయాలు, రేపాక, రామోజీపేట శ్రీ సీతారాముల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నేత కార్మికులు

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరలకు సంబంధించిన యారన్ సబ్సిడీ డబ్బులను ప్రభుత్వం రూ.8.77 కోట్లు విడుదల చేయడంపై సిరిసిల్ల నేతన్నల్లో హర్షం వ్యక్తమైంది. స్థానిక బీవైనగర్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించి తమ అభిమానాన్ని చాటారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సిరిసిల్లలోని 5,300 మంది నేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం నుంచి సబ్సిడీ నిధులు విడుదలైనట్లు వెల్లడించారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వేముల రవి, టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పోరండ్ల రమేశ్ పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం రైతుబంధు

ఎల్లారెడ్డిపేట: రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. మండల కేంద్రంలో రైతుబంధు డబ్బులు రైతు ఖాతాల్లో జమకావడాన్ని స్వాగతిస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు కృష్టారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణహరి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బెస్ట్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా నాగరాజు


ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై నాగరాజు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ ఎస్సై నాగరాజుకు బెస్ట్ ఇన్వెస్టిగేషన్ అధికారిగా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. బుధవారం రాత్రి జిల్లాలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ ప్రశంసాపత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రతి నెల కేసుల సేకరణలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిబద్ధతతో పనిచేయడంతో ఈ గుర్తింపు లభించినట్లు ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా దారి.. పట్టించుకునే వారేరి..?


ఇరుకుగా మారిన దారి

రుద్రంగి: మండల కేంద్రంలోని రామకిష్టాపూర్ కాలనీలోని ఎల్లంపెల్లి ఎత్తిపోతల పథకం కాలువ వద్ద దారి పూర్తిగా కోసుకుపోయి ప్రమాదరంగా మారింది. కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లేందుకు వీలు లేకుండా దారి కోసుకుపోయి గ్రామ ప్రజలు, రైతులు, దుర్గాదేవి ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. నెలల తరబడి దారి ఇలాగే ఉన్నా పట్టించుకున్న నాథుడు లేడని గ్రామ ప్రజలు, భక్తులు, రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి దారిని బాగుచేయాలని వారు కోరుతున్నారు.

పేరుకే రీడింగ్ రూమ్

- దినపత్రికలైన కనిపించని 'పఠన మందిరం'
- గ్రంథాలు, పుస్తకాలు అసలే లేవు
- నిర్వహణ లోపం.. నెరవేరని లక్ష్యం


ఖాళీ రాక్స్‌తో టేబుళ్లకే పరిమితమైన రీడింగ్ రూమ్

ముస్తాబాద్: విద్యార్థులు, యువత కోసం కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేకంగా ఏర్పాటు చేయించిన పౌర పఠన మందిరం నిర్వహణ లోపంతో వెలవెలబోతోంది. ప్రస్తుత డిజిటల్ వ్యవస్థలో పుస్తక పఠనం ద్వారా విషయ పరిజ్ఞానం పెరుగుతుందనే ఉద్దేశ్యంతో పక్షం రోజుల క్రితం ప్రారంభించిన ఈ రీడింగ్ రూం తెరుచుకోవడం లేదు.

పుస్తకాల లేమీ?

స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ రీడింగ్ రూమ్‌కు కలెక్టర్ రూ.1.50 లక్షలు మంజూరు చేశారు. వీటితో షెడ్డు ముందు భాగాన్ని అద్దాలతో కవర్ చేసి, లోపల అందమైన పెయింటింగ్స్ వేశారు. రూ.10 వేల విలువైన పుస్తకాలు, రూ.లక్షతో రెన్నోవేషన్, రూ.40 వేలతో ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. అయితే రీడింగ్ రూమ్‌లో బీరువాలు పుస్తకాలు లేక ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. కనీసం ఇక్కడ దిన పత్రికలు కూడా అందుబాటులో లేవు. ఉదయం, సాయంత్రం వేళల్లో తీయాల్సిన రీడింగ్ రూమ్ మూసి వుండడం కనిపిస్తోంది. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మాత్రం వేలాది గ్రంథాలు, పుస్తకాలు ఉండగా, ఈ రీడింగ్ రూమ్‌లో ర్యాక్స్ ఖాళీగానే కనిపిస్తున్నాయి.

దాతలతో పుస్తకాల సేకరణ

రీడింగ్ రూమ్ నిర్వహణకు పంచాయతీ సిబ్బందిని నియమించాలి. స్వచ్ఛంద సంస్థలు, దాతల నుంచి పెద్ద ఎత్తున పుస్తకాలు, గ్రంథాలు సేకరించి అందుబాటులో ఉంచాలి. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే ఉద్యోగార్థులకు ఉపయోగపడేలా మెటీరియల్ సేకరించి పెట్టాలి. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో రీడింగ్ రూమ్‌ను అభివృద్ధి చేసి పాఠకులకు అందించాలి. ఉపసర్పంచ్ రవీందర్‌గౌడ్ రూ.24 వేలు వెచ్చించి వారి తండ్రి నర్సాగౌడ్ జ్ఞాపకార్థం డ్రింకింగ్ వాటర్ కూలర్‌ను అందించారు. దాతలకు అవగాహన కల్పించి, మరిన్ని నిధులు సేకరిస్తే కలెక్టర్ ఆశయం నేరవేరుతుంది.

సమయపాలన పాటిస్తే..

పఠన మందిరాన్ని ఉదయం, సాయంత్రం సమయపాలన పాటిస్తూ పాఠకులకు అందుబాటులో ఉంచాలి. పంచాయతీ కార్యాలయం ఆవరణలో, పట్టణ నడిబొడ్డున ఉండడంతో నిత్యం పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. రీడింగ్ రూమ్ ఆవశ్యకతపై అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రచారం చేయాలి



ముస్తాబాద్ పంచాయతీ కార్యాలయం ఆవరణలోనే రీడింగ్‌రూమ్ పెట్టడం సంతోషం. ఎంతో మంది నిరుద్యోగులు, యువత, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకునేలా ప్రచారం కల్పించాలి. కలెక్టర్ ఆశయం నెరవేర్చాలి. పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానాన్ని పొందవచ్చనే విషయం చెప్పాలి. – చర్లపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ

అభివృద్ధి చేయాలి



అన్ని వర్గాల ప్రజల్లో పఠనాసక్తిని పెంచేలా చర్యలు తీసుకోవాలి. ఇక్కడ గ్రంథాలు, చరిత్ర, సాహిత్యం, పోటీ పరీక్షల మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలి. దినపత్రికలు ఉంచాలి. లైబ్రరీకి ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేయాలి. పఠనాసక్తితో చైతన్యవంతులు కావచ్చు. – మల్లారపు సంతోష్‌రెడ్డి, ముస్తాబాద్

దాతల సహకారం తీసుకుంటాం



ముస్తాబాద్‌లో ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్‌లో అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతాం. ఒక స్కావెంజర్‌ను నియమిస్తాం. పత్రికలు, ఇతర గ్రంథాలు అందుబాటులో ఉంచుతాం. దాతల సహకారంతో మినీ లైబ్రరీగా అభివృద్ధి చేస్తాం. – బి.రాజు, పంచాయతీ కార్యదర్శి

రూ.కోట్ల నిధులున్నా.. పాట్లు తప్పడం లేదు

- చింతలఠాణ గ్రామానికి తీరని రోడ్డు కష్టం
- రోడ్డు నిర్మాణం చేపట్టాలంటున్న గ్రామస్తులు


మట్టి రోడ్డు పరిస్థితిని చూపుతున్న గ్రామస్తులు

తంగళ్లపల్లి: మండలంలోని చింతలఠాణ గ్రామస్తులకు రోడ్డు చింత తీరడం లేదు. గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోట్లు నిధులు మంజూరైన తమకు ప్రయాణ పాట్లు తప్పడం లేదని వాపోతున్నారు. గ్రామస్తులు ఇబ్బందులు గుర్తించి మంత్రి కేటీఆర్ గతేడాది జూలైలో రూ.2.61 కోట్లు నిధులు మంజూరు చేశారు. నిధులు మంజూరై ఏడాది కావొస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. అధికారులు ఆక్వాహబ్‌ను సాకుగా చూపుతూ పనులు పక్కన పెట్టారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మిడ్ మానేరు మా గ్రామాన్ని మింగేసిందని ఇప్పుడు ఆక్వాహబ్ రోడ్డును మింగేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి తమకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

బండపల్లి ఊర చెరువు కట్టపై భారీ గుంత

- మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు


బండపల్లి చెరువు కట్టపై ఏర్పడిన గుంత

చందుర్తి: మండలంలోని బండపల్లిలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామ ఊర చెరువు కట్టపై భారీ గుంత పడింది. ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు రెండవ దశలో భాగంగా బండపల్లి ఊర చెరువును మినీ రిజర్వాయర్ నిర్మించారు. నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడం వల్లనే కట్టపై గుంత ఏర్పడిందని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు కట్టకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. రెండేళ్ల క్రితం ఇలానే భారీ గుంత ఏర్పడిందని కట్ట పొడవునా ఎక్కడ పడితే అక్కడే గుంతలు పడుతుండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాయిచంద్‌కు నివాళి



ఎల్లారెడ్డిపేటలో సాయిచంద్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్ : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు సాయిచందు మృతిపై జిల్లాలో పలువురు సంతాపం తెలిపారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో సాయిచందు తన గళంతో, కలంతో ముందున్నారన్నారు. సాయిచందు చిన్నవయసులోనే గుండెపోటుతో మరణించడం చాలా బాధకరమని టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య సంతాపం ప్రకటించారు. ఎల్లారెడ్డిపేటలో సాయిచందు చిత్రపటం వద్ద బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల నాయకులు నివాళి అర్పించారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, పట్టణాధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు ఎలుసాని మోహన్‌కుమార్, మల్లారెడ్డి, సందీప్, మీసం రాజం, దేవేందర్ నివాళి అర్పించారు. మండలంలోని గొల్లపల్లిలో బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు అందె సురేష్, కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ జబ్బర్, ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అందె సుభాష్, నాయకులు రాగం ఎల్లయ్య, తీగల ప్రకాశ్, అందె బాలయ్య, దొంత మనోహర్, మహ్మద్ సద్దాం, కొండ సృజన్ పాల్గొన్నారు. ముస్తాబాద్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సాయిచంద్ చిత్రపటానికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కొమ్ము బాలయ్య, శ్రీనివాస్, దేవేందర్, మనోహర్, నవాజ్, అన్వర్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.


ముస్తాబాద్‌లో..

చిత్రకథ



మరుగుదొడ్లు నిరుపయోగం

ఎల్లారెడ్డిపేట: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. నీటి వసతి లేకపోవడంతో మరుగుదొడ్లను వాడడం లేదు. ఫలితంగా ప్రతిరోజు ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. దశాబ్ద కాలంగా ఈ సమస్యను పరిష్కరించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమవుతున్నారు. డిపో మేనేజర్‌కు స్థానికులు పలుసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ విషయంపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


భూమిపూజ చేస్తున్న నాయకులు

వీర్నపల్లి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రామాల్లోని ఆలయాలను అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య అన్నారు. మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి ఆలయం వద్ద జెడ్పీటీసీ నిధులతో గురువారం బోరు బావిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీటీసీ నిధుల రూ.లక్షతో బోరు బావికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కళావతికి గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ భూల, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సర్పంచ్ పాటి దినాకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, నాయకులు సురేశ్, శ్రీరాం, తిరుపతి, దేవయ్య, దేవేందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీపీ నిధులతో బోరు

రుద్రంగి: మండల కేంద్రంలోని ఆదర్శ యూత్, ముదిరాజ్ సంఘం, 7వ వార్డు అయ్యోరు కాలనీలో ఎంపీపీ నిధులు రూ.4.5 లక్షలతో మూడు బోరుబావులకు ఎంపీపీ గంగం స్వరూపారాణి గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, వార్డు సభ్యులు, నాయకులు గంగం మహేశ్, పల్లి గంగాధర్, పూదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో తల్లిలా సేవలు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగులు, వికలాంగులకు ప్రత్యేకంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో నిర్వాహకురాలు జయలక్ష్మి తల్లిలా వారికి విద్యాబోధన చేస్తూ సేవలను అందిస్తోంది. వేములవాడ పట్టణ, అర్బన్ మండలాల నుంచి దివ్యాంగులు ఈ కేంద్రంలో విద్యనభ్యసించారు. వీరికి నిర్వాహకురాలు తల్లిదండ్రుల కంటే ఎక్కువ సేవలందిస్తూ విద్యనందిస్తోంది.

సమాచారం

నేడు తంగళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశం

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.లచ్చాలు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.